
# పైల మహాముని



పైల మహాముని సాయం సంధ్య సమయాన అనుష్ఠానాదులు పూర్తి చేసుకుని పెరటిలో పొన్నచెట్టుదగ్గర అరుగు మీద విశ్రయించారు. పున్నమి చంద్రుడు నిండుగా ప్రకాశిస్తున్నాడు. సిగలో జాజిపూలు తురుముకుంటూ మునిపత్ని పక్కన కూచోబోయింది.

"కొంచెం దూరంగా - ఇంకా నాశిష్యులు అటూ ఇటూ తిరుగుతున్నారు కదా!" భార్య వంక తదేకంగాచూస్తూ అన్నారు పైల మహాముని. ఆమె నున్నని భుజాల పైన, పల్చని చెక్కిళ్ళ పైన, ఎర్రని పెదాల పైన ఆ చూపులు క్రమంగా ప్రసరించాయి. సృష్టి వైచిత్ర్యం - మహా తపస్సంపన్నుడైన తను కూడా, ప్రపంచాన్నే శాసించగల తను కూడా, భార్యను దూరంగా కూచోమనడం-అర్థమేమిటి - తనూ అందరిలాగే సంఘంలో ఉన్న సభ్యతనూ, కట్టుబాటునూ పాటిస్తున్నాడా - తన తపస్సుకీ, ధ్యానానికీ చాలా సహకరిస్తోంది తన ధర్మపత్ని. నఖ శిఖ పర్యంతం ఆమెను పరిశీలనగా చూశాడు ముని మరొక్కసారి.

మునిపత్ని చివాల్న ఆయన పాదాల చెంత కూర్చుంది. తన మాటను గౌరవించడం కోసమే తన పాదాల చెంత కూచుందా - ఏమో!

పైలమునిపాదాలకేసి చూపు నిలిపిందామె. ఎంతో కోమలంగా ఉన్నాయి పాదాలు - ఆశ్చర్యం - అడవిలో, ముళ్ళతో, రాళ్ళతో సంచరించే పాదాలేనా ఇవి? - లేత పచ్చిక తగిలితే కందిపోయేలా ఉన్నాయి! ఆ పాదాల్ని ఎన్నిసార్లు స్పృశించలేదూ, సేవించలేదూ, నమస్కరించలేదూ తను! వంచిన తల ఎత్తకుండానే, "నాదో చిన్న కోరిక స్వామీ!" అంది మునిపత్ని.

ముని ఆమె వంచిన శిరస్సునే చూస్తున్నాడు. ఏనాడూ, ఏ కోరికా కోరని తన ప్రియపత్ని కోరిక అని అంటుంటే భ్రుకుటి ముడి విడిచాడు. ఆమె తల వంచుకునే ఉంది. ముని చూపులు ఆమె శిరోజాలపై నిలిచాయి. తన భార్య శిరోజాల సొగసు తను ఎన్నిమార్లో తిలకించాడు. - అయినా ఈ పున్నమి చంద్రుడు కొంటెతనంగా, ఆమె శిరోజాల నిగారింపు, సొగసు, మరీ మరీ స్పష్టంగా కనబడేలా అటే ప్రకాశిస్తున్నాడు... ఆమె మనసులోని కోరిక వైపు మళ్ళించాడు మహర్షి మనసును.

"చెప్పు - నీ అభీష్టం" -

"నేను మీ ధర్మపత్నిని కదా!" -

"ఊఁ!"

"మీ శిష్యులు, పరిచారకులు, ఆశ్రమవాసులు ఎందరెందరో నన్ను చూస్తున్నారు కదా!"

"ఊఁ!" -

ఆమె తల పైకెత్తి భర్త ముఖంలోకి చూసింది.

"ఈ నా సౌందర్యం, అశుచియైన మనస్సున్న ఏ వ్యక్తి కంటపడ కూడదు స్వామీ!" -

పైల మహాముని దీర్ఘంగా ఆలోచిస్తున్నట్టు కనబడ్డాడు.

"అలాటి ఉత్తమ స్థితి నాకు కావాలి - శుచియైన మనస్సున్నవారికే నేను కనపడాలి" - ఒక క్షణం ఆగింది మునిపత్ని.

"మీరు సర్వజ్ఞులు. నా కోరికలో దోషమేమైనా ఉందా?" ఆమె చూపులు ముని పాదాలపైనే ఉన్నాయి.

చిరు నవ్వు నవ్వి ఆమె శిరసు నిమిరాడు ముని.

"నువ్వు నా భార్యవి మాత్రమే కాదు. నా ప్రేయసివి. నా శిష్యురాలివి. నా భక్తురాలివి. నా సేవకురాలివి - నేనంటే నీకున్న ప్రేమ, గురుత్వం నాకు తెలియనివి కావు - ఈ కోర్కె తీర్చేందుకు నా శక్తి యుక్తులు ఎంత వరకు వెచ్చించాలి అని ఆలోచిస్తున్నాను." పైలముని భార్యకళ్ళలోకి చూశాడు.

ఆ కళ్ళు స్ఫటికంలా, నిర్మలంగా మెరుస్తున్నాయి.

మునిపత్ని తత్తరపడింది. "నా కోసం మీ శక్తి వెచ్చించటమా? ఒద్దు స్వామీ! - అది నా అభిలషితం కాదు. ఈ అల్పజీవి కోసం నిరంతర తపో దీక్షా పరులై సాధించినది ధార పోయడం నా కోరిక కాదు... మార్గాంతరమేదైనా ఉందేమో చూడండి." ముని కేసి చూసింది.

సౌందర్యరాశి, సుగుణాలఖని అయిన భార్యను హృదయానికి హత్తుకున్నాడు. స్వర్ణ కాంతులను మించిన ఆమె చెక్కిళ్ళు, రాగరంజితాలైన ఆమె పెదవులను చుంబించాడు. ఆమె సిగలోని తెల్లని జాజుల పరిమళం తెల్లని వెన్నెల్లా పరుగులు తీస్తోంది. వాయు వీచికల్లో నిండిన సౌరభం శరీరానికి అంతా హాయిని కలుగచేస్తూ ఉంటే అప్రయత్నంగా భర్త భుజాల మీద తల వాల్చింది. పున్నమి వెన్నెల మునిపై ప్రసరిస్తుంటే, తన్మయత్వంతో అతనిలో ఐక్యమైపోయిందా క్షణంలో.

"క్షమించండి - నా స్వార్థపరత్వానికి." నెమ్మదిగా గొంతు విప్పింది మునిపత్ని.

"కేవలం స్త్రీ ఇచ్చే సుఖాల కోసం ఎందరెందరు మునీశ్వరులు తమ తమ శక్తిని ధారపోశారో నీకు తెలియనిది కాదు. నా ధర్మపత్నివి. నా సహధర్మచారిణివి. నీ అభీష్టం తీర్చడం నా ధర్మం కాదా?" భర్త మాటలకు ఆమె నయనాలు తృప్తితో నిండిపోయాయి. పైల మహాముని బాహువుల్లో ఒదిగిపోయిందామె. ముని మనసు ఆమెకు అర్థమైపోయింది.

"నువ్వు శ్రీవ్రతం చేస్తే నీ కోరిక తీరుతుంది. కానీ అది సఫలీకృత మవాలంటే దివ్య రత్న కుండలాలు ధరించాలి."

ఉలిక్కిపడింది ఆమె. దివ్య రత్న కుండలాలా? అవి ఎలా లభిస్తాయి? ఆమె ముఖంలో ఏదో ఆందోళన నిండింది. ముని చిరునవ్వు నవ్వాడు.

"మహా పతివ్రత అయిన పౌష్య మహారాజపత్ని దగ్గర అవి ఉన్నాయి."

"మరి - "

"ఆమె సపాత్రదానం చేయడానికి వెనుకాడదు."

"నేను స్వయంగా ఎవరినీ అభ్యర్థించను కదా, అవి వచ్చే మార్గం?" సందేహంగా భర్తకేసి చూస్తూ అంది.

"అదే - వాటిని కాజేయాలని ఎప్పటి నుంచో తక్షకుడు ఎదురు చూస్తున్నాడు. అతను మహా బలశాలి. మాయావి. అతని బారిపడకుండా వాటిని తేగల సమర్థుడు ఎవరా అని ఆలోచిస్తున్నాను. అతడు నిర్మల మనస్కుడు, కార్యదీక్షాపరుడు, నిష్ఠాగరిష్ఠుడు, గురు సేవా పరాయణుడు అయి ఉండాలి."

పైల ముని ముఖం ఒక్కసారి గంభీరంగా మారింది. అతని కళ్ళ ముందు అష్ట సిద్ధి సంయుతుడైన ఉదంకుడు కదలాడాడు.

అంతలోనే "దివ్య రత్న కుండలాలు తెమ్మని ఉదంకుని నియోగిస్తారా?" అంది ముని పత్ని.

పైలముని మనస్సు సంతృప్తిపడింది. ఆ కార్య నిర్వహణా దక్షుడు ఉదంకు డొక్కడేనని తనకు తెలుసు. కానీ - తన భార్య కెలా తెలుసు! - ఈమె కేవలం గురు పత్ని మాత్రమే కాదు, మాతృమూర్తి, జ్ఞానవతి, వివేకవతి కూడా. - ఆశ్చర్యంగా భార్యకేసి చూస్తుంటే - చంద్రుడు వారి ఏకాంతానికి భంగం కలిగించకుండా మబ్బుల చాటున మాయమయ్యాడు.

పైల ముని తన శిష్యుడైన ఉదంకుడికి దివ్య రత్న కుండలాలు తెచ్చే మార్గం చెప్పి, ఆదేశించాడు. ఆ పనినే ఉదంకుడు తనకిచ్చే గురు దక్షిణగా భావిస్తానని చెప్పాడు.

అనితర సాధ్యమైన పౌష్య పత్ని రత్న కుండలాలు సాధించి, చెప్పిన నాల్గవ నాటికి తెచ్చి గురు పత్ని ముందుంచాడు సవినయంగా ఉదంకుడు.

దివ్య రత్న కుండలాలు ధరించి వ్రత దీక్షలో ఉన్న ధర్మ పత్ని, దివ్యత్వంతో తేజరిల్లుతుంటే, పరితృప్తుడైన పైలమహాముని పెదవుల్లో చిరునవ్వు వెల్లివిరిసింది.

*

(ఆధారం : కవిత్రయం వారి శ్రీమదాంధ్ర మహాభారతం : ఆదిపర్వం : ప్రథమాశ్వాసం)

(ప్రచురణ : ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక : 26-8-1987)